క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు అభినందనలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసి వంద రోజులు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు గోడిలోని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఇంటి వద్ద అభినందన కార్యక్రమం నిర్వహించారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ కట్ చేయగా అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, దొమ్మేటి వెంకటేశ్వరరావు, రేవు శ్రీనివాసరావు పార్టీ శ్రేణులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

చిరు వ్యాపారులకు గొడుగులు అందజేత



చిరు వ్యాపారికి గొడుగును అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: రహదారులపై వ్యాపారాలు చేసుకునే ముగ్గురు చిరు వ్యాపారులకు తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులు అందజేశారు. శుక్రవారం తాళ్లరేవులో జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి గుబ్బల రాంబాబు సౌజన్యంతో జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ జి.సతీష్‌రాజు, డీసీటీ నున్న దత్తు, జోన్ చైర్మన్ బి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

ముమ్మిడివరం: మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని భారత రిపబ్లికన్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకురి మిల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అక్కడ మానవహక్కుల ఉల్లంఘన జరిగిందని, మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనను తమ పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. కేంద్రంలో బీజేపీ పాలనలో మతం, కులం ముసుగులో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

ముమ్మిడివరం: డెంగీ మాసోత్సవాల్లో భాగంగా నగర పంచాయతీ పోలమ్మ చెరువు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్య అధికారిణి అపరంజి ఆధ్వర్యంలో సిబ్బంది వీధులలో ర్యాలీ నిర్వహించి డెంగీ నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ రోజువారీ బాధ్యతల అప్పగింత

యానాం: రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణన్ పుదుచ్చేరికి బదిలీపై వెళ్లిన నేపథ్యంలో యానాం శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి రోజువారీ వ్యవహారాలను చూసుకోవాలని శుక్రవారం మున్సిపల్ సూపరింటెండెంట్ ఖండవల్లి రామకృష్ణకు ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిందూ రెలిజియస్ ఇనిస్టిట్యూషన్స్ అండ్ వక్ఫ్ కమిషనర్ (పుదుచ్చేరి) ఎ.శివశంకరన్ ఆదేశాలు జారీచేశారు.

సెంటాక్ ద్వారా విద్యార్థుల ఎంపిక

యానాం: సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ (సెంటాక్) ద్వారా వివిధ కోర్సుల్లో ఎంపికైన మొదటి రౌండ్ కేటాయింపు జాబితాను శుక్రవారం కన్వీనర్ విడుదల చేశారు. యానాం రీజెన్సీ విద్యార్థులు అత్యధిక సీట్లను సాధించారు. బీటెక్ కోర్సుల్లో 14 మంది, బీఎస్సీలో 8మంది, బయోలజీ కోర్సుల్లో 17 మంది సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్ తెలిపారు.

బేడా బుడగ జంగాల వినతి

ముమ్మిడివరం: సంచార జాతివారమైన తమకు ప్రభుత్వం ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరుతూ బేడా బుడగ జంగాల సభ్యులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తమను ఎస్సీలుగా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారన్నారు. అయితే రాష్ట్ర విభజన అనంతరం బేడా బుడగ జంగాలు తెలంగాణాలో మాత్రమే ఉన్నారని ఆంధ్రలో లేరని తేల్చేసి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. పేర్ల దుర్గా ప్రసాద్, కళ్యాణం సత్యం, కళ్యాణం మావుళ్లు, ముగ్గల నూకాలు, ఉప్పు సుబ్బారావు పాల్గొన్నారు.

సచివాలయాలు సేవా కేంద్రాలు

- లబ్ధిదారుని ఇంటివద్దకే సంక్షేమ సేవలు
- గ్రామ స్వరాజ్యం వచ్చిందంటున్న జనం
- అవినీతికి ఆస్కారం లేకుండా నిర్వహణ

కాట్రేనికోన: ప్రజల ముంగిటకు సంక్షేమ సేవలు చేరువ చేసేందుకు ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమల్లోకి తెచ్చిన గ్రామ సచివాలయాలు తమకు సంక్షేమ సేవలు అందించే సేవా కేంద్రాలుగా ఉన్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికీ సంక్షేమ సేవలు ఇంటివద్దకే అందిస్తున్న గ్రామ సచివాలయ కేంద్రాలతో గ్రామ స్వరాజ్యం వచ్చిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 16 పంచాయతీలకు రెండు వేల జనాభాకు సచివాలయం చొప్పున 22 గ్రామ సచివాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతీ సచివాలయంలోనూ 10 శాఖలకు చెందిన అధికారులను ప్రభుత్వం నియమించింది. సిబ్బందికి అవసరమైన ఫర్నీచరు సమకూర్చింది. గ్రామ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, ఫిషరీష్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్, ఎలక్ట్రికల్ అసిస్టెంట్, హెల్త్ అసిస్టెంట్, మహిళా పోలీసు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ అసిస్టెంట్, తదితర శాఖల అధికారులను సచివాలయంలో అందుబాటులో ఉంచింది.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

సంక్షేమ సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగవలసిన పని లేకుండా సకాలంలో ప్రజకు సేవలు అందిస్తున్న గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం వచ్చిందంటున్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ కార్యాలయం రావడం, అవినీతికి ఆస్కారం లేకుండా సకాలంలో సేవలు అందిస్తున్న సచివాలయాలు దేశంలో ఆదర్శంగా నిలిచాయి.

అందిస్తున్న సేవలు

వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సేవలను గ్రామ సచివాలయాలలో ప్రజలకు అందిస్తున్నారు. నవరత్నాలకు సంబంధించిన పింఛను పంపిణీ, అందరికీ ఇల్లు, చేదోడు, చేయూత, కాపు నేస్తం, నేతన్న నేస్తం, కొత్త పింఛను, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం, భూముల రీసర్వే, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రెసిడెన్షియల్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో అనేక సేవలను వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి అందిస్తున్నారు.

18 సచివాలయాలకు నూతన భవనాలు

సచివాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలనే ధ్యేయంతో ప్రభుత్వం నిర్మాణ పనులు చేపట్టింది. మండలంలో 22 గ్రామ సచివాలయాలకు 18 సచివాలయాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. రూ.25 లక్షలతో నిర్మించిన పల్లం సచివాలయం పూర్తి అయింది. గెద్దనాపల్లి, కొప్పిగుంట, కాట్రేనికోన-1, కందికుప్ప-1 సచివాలయాలు రూ.35లక్షల చొప్పున , మిగిలిన 13 సచివాలయాలు రూ.40 లక్షల చొప్పున నిధులతో నిర్మాణమవుతున్నాయి.



పల్లంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

కాళ్లు అరిగేలా తిరిగే వాళ్లం



పింఛను సొమ్ము కోసం గత ప్రభుత్వంలో పంచాయతీ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిప్పుకునేవారు. వేలిముద్ర పడలేదంటూ ఏడాదిలో ఒకటి రెండుల నెలలు సొమ్ము చేతికి ఇచ్చేవరు కాదు. గ్రామ సచివాలయాలు వచ్చిన తరువాత వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛను సొమ్ము ప్రతి నెలా అందిస్తున్నారు. మా ఇంటిలో మా మనవడికి అమ్మ ఒడి వస్తుంది.

– మోకా విజయకుమారి, పింఛనుదారు, కుండలేశ్వరం

ఇంటికి వచ్చి సంక్షేమం అందిస్తున్నారు



సచివాలయాలు వచ్చిన తరువాత వలంటీర్లు అర్హత ఉన్న లబ్ధిదారుల ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. మా పాప పాఠశాలకు వెళుతున్నందుకు అమ్మ ఒడి రూ.15 వేలు ఖాతాలో పడుతోంది. మా అమ్మకు ఆసరా లబ్ధి రూ.18,500 వస్తోంది. పిల్లలు చదువులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు గతంలో తహసీల్దారు కార్యాలయానికి వెళ్లవలసి వచ్చేది. వలంటీర్లు సచివాలయంలో దరఖాస్తు చేయించి ఇంటికి తెచ్చి ఇచ్చారు.

– బొమ్మిడి వెంకటలక్ష్మి, అమ్మ ఒడి, నడవపల్లి

పథకాల పనితీరుపై సమీక్ష

అల్లవరం: ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాల పనితీరుపై ఎంపీడీఓ కృష్ణమోహన్ సమీక్ష నిర్వహించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ నిర్మాణాలు, విద్యార్థులు, ఫీవర్ సర్వే, వాటి ప్రగతిపై సమీక్ష జరిపారు. గ్రామ సచివాలయం భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎగువ ప్రాంతాల్లో వరద పెరుగుతున్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రక్షణ చర్యలపై చర్చించారు. హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఏపీఎం సయ్యద్, సూపరింటెండెంట్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆదివాసీలకు రక్షణ కల్పించాలి

అమలాపురం టౌన్: మణిపూర్‌లో ఆదివాసీలకు రక్షణ కల్పించాలని దళిత బహుజన మహిళా శక్తి జాతీయ (డీబీఎంఎస్) కన్వీనర్ కొంకి రాజామణి డిమాండ్ చేశారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో రాజామణి ఆధ్వర్యంలో మణిపూర్ అకృత్యాలను నిరసిస్తూ శుక్రవారం ధర్నా, నిరసన ప్రదర్శన జరిగాయి. మణిపూర్‌లో స్త్రీలను నగ్నంగా ఊరేగిస్తూ సామూహిక అత్యాచారాలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఉదాసీనతగా వ్యవహరిస్తోందని రాజామణి ఆరోపించారు. ఉభయ గోదావరి జిల్లాల డీబీఎంఎస్ కో ఆర్డినేటర్ బూల తులసీ ముని, రాష్ట్ర కో ఆర్డినేటర్ కాశీ పద్మావతి, న్యాయవాది జల్లి మహాలక్ష్మి పాల్గొన్నారు.

ప్రాధాన్యతా భవనాలతో ప్రజలకు సౌకర్యాలు



తాండవపల్లిలో సచివాలయ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రాధాన్యతా భవనాలను పూర్తి చేసి ప్రజలకు సౌకర్యాలు అందుబాటులో తీసుకువస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శుక్రవారం తాండవపల్లి గ్రామంలో నూతనంగా రూ.45 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. గ్రామంలో రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ. 3లక్షలతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక అని వీటి ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, గెడ్డం సంపదరావు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, ఎంపీటీసీ సభ్యుడు రేవు శ్రీను, సర్పంచ్‌లు రేలంగి దుర్గారావు, పెనుమాల సునీత, పోనకల గణేష్ పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న గోదావరి



యానాం పుష్కరఘాట్ వద్దకు చేరుకున్న వరదనీరు

యానాం: యానాం వద్ద గౌతమీ గోదావరి నది శుక్రవారం పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. స్థానిక యానాం-ఎదుర్లంక బాలయోగి వారధి వద్ద ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తుండటంతో తీర గ్రామాల్లోని ప్రజలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. స్థానిక శివమ్‌బాత్, బోట్‌క్లబ్‌ను తాకుకుంటూ వరదనీరు ప్రవాహం వేగంగా ఉంటుండటంతో రాజీవ్‌బీచ్ వద్ద సందర్శకులకు పోలీసులు జాగ్రత్తలు తెలుపుతున్నారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకుండా ఇప్పటికే అధికారులు సూచనలు చేశారు. పుష్కరఘాట్ మెట్ల వరకు గోదావరి వరద నీరు చేరుకుంది. ముఖ్యంగా గతంలో వరదనీరు వచ్చిన దృష్ట్యా బాలయోగి నగర్, ఓల్డ్‌రాజీవ్‌నగర్, అయ్యన్ననగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. పిడబ్ల్యూడీ, మత్స్యశాఖ, విద్యుత్ తదితర శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆర్ఏఓ కార్యాలయంలో 0884-2325105 నంబర్‌తో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు.

పొంగి పొర్లుతున్న గోదావరి

ఐ.పోలవరం: ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి పొంగి ప్రవహిస్తోంది. ఐ.పోలవరం మండలం వృద్ధగౌతమీ గోదావరి చుట్టు లంక గ్రామాలను వరదనీరు చుట్టుముట్టింది. లంక ప్రాంతాలలోని రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సురక్షి ప్రాంతాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న పశువులను ఏటుగట్టుపైకి తరలిస్తున్నారు. మండలంలో మురమళ్ల శివారు పార్కు నీట మునిగింది. అక్కడ నివాసముంటున్న నివాసగృహాలకు వరదనీరు పోటెత్తుతోంది. దీంతో అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాటు చేస్తున్నారు. కేశనకుర్రు, పుగాకు లంక, పాట్టిలంక వరద నీరు చేరుకుంటోంది. ఎదుర్లంక జీఎంసీ బాలయోగి వారధి వద్ద గోదావరి ఉరకలేస్తోంది. గుత్తెనదీవి, జి.మూలపాలెం రేవులలో అధికారులు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ యథావిధిగా నాటుపడవలపై ప్రజలను తరలిస్తున్నారు.

సీపీఆర్‌తో గుండె స్తంభనను సరిచేయవచ్చు

అమలాపురం టౌన్: ఏదైనా ప్రమాదం అనివార్యమైనప్పుడు మనిషి గుండె స్తంభించే పరిస్థితి ఎదురైతే కార్డియో పల్మనరీ రీసెస్టకేషన్ (సీపీఆర్) విధానం ద్వారా సరిచేయవచ్చని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు అన్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థసిస్ట్స్ (ఐఎస్ఏ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆస్పత్రిలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)కు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ శంకరరావు మాట్లాడారు. ఐఎస్ఏ అమలాపురం శాఖ కార్యదర్శి డాక్టర్ వాసంశెట్టి శ్రీనివాసరావు సీపీఆర్ వైద్య ప్రక్రియతో గుండెపోటు వచ్చిన వ్యక్తిని ఎలా కాపాడుకోవచ్చో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ మాజీ రాష్ట్ర పతి దివంగత అబ్దుల్ కలామ్ కార్డియాలిజీ అరెస్ట్‌తో చనిపోయిన పరస్థితి మరొకరికి రాకుండా ఐఎస్ఏ దేశ వ్యాప్తంగా ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకూ వారం రోజులపాటు వివిధ ఆస్పత్రుల్లో చైతన్యవంతంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏరియా ఆస్పత్రి మత్తు వైద్యులు సుప్రియ, సుధీర్, ఇన్‌చార్జి ఆర్ఎంవో డాక్టర్ అనూష పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

పథకాలను అర్థమయ్యేలా వివరిస్తాడు



రామలక్ష్మికి పథకాల గురించి వివరిస్తున్న వలంటీర్ సతీష్‌కుమార్

ఇతను పేరు రెడ్డి సతీష్‌కుమార్. అమలాపురం మున్సిపాలిటీ 16వ వార్డులో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రభుత్వ పథకాలను తన పరిధిలోని 50 ఇళ్ల కుటుంబాల వారికి అర్థమయ్యేలా వివరిస్తాడు. అర్హులతో దరఖాస్తు చేయించి వారికి ఆ పథకం లబ్ధి అందే వరకూ శ్రమిస్తూనే ఉంటాడు. ఆరోగ్య సమాచారం, తద్వారా పొందే రాయితీల గురించి అవగాహన కల్పిస్తాడు. అందుకు ఆ 50 ఇళ్ల వారికి వలంటీర్ సతీష్ ఓ సంక్షేమ సమాచారిగా మారాడు. ఏ పథకానికి ముఖ్యమంత్రి జగన్ ఎప్పుడు బటన్ నొక్కి డబ్బులు వేస్తారో ముందుగానే ఆయా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సమాచారం ఇస్తాడు. ఈ పథకం ద్వారా వారు తాజా సంవత్సరానికి లబ్ధి పొందేలా అన్ని ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు ఇచ్చే వరకూ తిరుగుతాడు.

అతడిచ్చిన సమాచారంతోనే నాలుగు పథకాల లబ్ధి



మా వలంటీర్ సతీష్ ఇంటికి వచ్చి ఇచ్చిన సమాచారంతో మా కుటుంబం ఈ రోజు నాలుగు పథకాల లబ్ధిని అందుకుంటోంది. అమ్మ ఒడి, వాహన మిత్ర, విద్యా దీవెన, నా భర్తకు వికలాంగ పింఛన్ వంటి పథకాల లబ్ధిని ప్రతి ఏటా అందుకుంటున్నాం. వలంటీర్ సతీష్ మాకు చక్కటి సేవలు అందిస్తున్నాడు.

– యార్లగడ్డ రామలక్ష్మి, 16వ వార్డు, అమలాపురం

నేతన్న నేస్తంతో చేయూత



కందికుప్పలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

కాట్రేనికోన: ప్రభుత్వం చేనేత సోదరులకు తోడుగా ఉండేందుకు ఏటా నేతన్న నేస్తంతో రూ.24వేలు ఖాతాలలో జమ చేస్తోందని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. అవినీతి రహిత పాలనలో భాగస్వాములైన వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. సర్పంచ్ చల్లగల వెంకట లక్ష్మి అధ్యక్షతన కందికుప్ప గ్రామ సచివాలయం -2లో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మొదటి విడతగా తాళ్లరేవు, ముమ్మిడివరం, ఐ.పోలవరంలో జగనన్న ఇల్లు మంజూరు అయ్యాయని, కాట్రేనికోనకు రెండవ విడతలో ఇస్తామన్నారు. ఎంపీడీఓ వెంకటచలం, డిప్యూటీ తహసీల్దారు ఝాన్సీల పర్యవేక్షణలో 2,770 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ముందుగా జమ్మిచెరువులో ఎంపీపీ నిధులు రూ.9 లక్షలు, సీఎస్ఆర్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. దొంతికుర్రు మర్ల చెరువు,కందికుప్ప శివారు కప్పలవారి పేటలలో వాటర్ ట్యాంక్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, ఈస్ట్ డెల్టా చైర్మన్ ఏడిది చక్రపాణిరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కాశి హనుమంతరావు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉప్పలగుప్తం: నేతన్న నేస్తం ఐదవ విడత విడుదల చేసిన సందర్భంగా సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో సచివాలయం కార్యాలయం వద్ద శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, పుత్యల ఏసు, దాసరి బద్రావతి, కోలా ఏసు, బళ్ల సతీష్, ఆశపు బుజ్జి, కారుపర్తి గిరి పాల్గొన్నారు.

రంగాపురంలో..

అమలాపురం రూరల్: నేతన్న నేస్తం పథకంలో శుక్రవారం రూ.24 వేలు కార్మికుల అకౌంట్లోకి జమ చేసిన సందర్భంగా సమనస పంచాయతీ పరిధిలోని రంగాపురంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కరెళ్ళ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. రామలింగేశ్వర చేనేత సహకార ఉత్పత్తి సంఘం అధ్యక్షుడు కరెళ్ళ వెంకటేశ్వరరావు అధ్యక్షతన లబ్ధి పొందిన చేనేత కార్మికులు అందరూ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘ కార్యదర్శి కరెళ్ళ నాగరాజు, డైరెక్టర్ కరేళ్ల మహేష్, సచివాలయం కన్వీనర్ అక్కిశెట్టి ప్రసాద్, సమనస, వన్నెచింతలపూడి,రంగాపురం గ్రామాల చేనేత కార్మికులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా సమస్యల పరిష్కారం



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న చైర్మన్ ప్రవీణ్ తదితరులు

ముమ్మిడివరం: జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం గొల్లలవీధి సచివాలయ పరిధిలో శుక్రవారం కమిషనర్ జి.లోవరాజు అధ్యక్షతన జరిగిన సురక్ష సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నే సంకల్పంతో ప్రభుత్వం జగనన్న సురక్ష అమలు చేస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొంతు సత్యశ్రీనివాస్, వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు అబ్బాదాసుల శ్రీనివాస్, ములపర్తి బాలకృష్ణ, దివి మహాలక్ష్మి, బడుగు శ్రీవాణి, నాయకులు మట్టా సత్తిబాబు, కర్రి శ్రీనివాస్, రేకాడివర్మ వలంటీర్లు, వివిధ శాఖాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

779 మందికి ధ్రువీకరణ పత్రాల అందజేత

తాళ్లరేవు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా కోరంగి పంచాయతీ సీతారామపురం సచివాలయం-3 పరిధిలో 779 మందికి ధ్రువీకరణ పత్రాలను జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అందజేశారు. శుక్రవారం స్థానిక సచివాలయం వద్ద సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన జరిగిన సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పలు కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులైన పేదలను గుర్తించి వారికి తక్షణమే న్యాయం జరగాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ ఎస్.పోతురాజు, నాయకులు కొపనాతి నాగరాజు, పెయ్యల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీయే లక్ష్యం

తాళ్లరేవు: మండలంలో తప్పులు లేని ఓటర్ల లిస్టు తయారీయే లక్ష్యమని అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్ఓ) ఎస్.పోతురాజు తెలిపారు. మండలంలో శుక్రవారం ఇంటింటి ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మండల పరిధిలోని 75 పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న సర్వేను ఆయన పర్యవేక్షించారు. యన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆగస్టు 20వ తేదీ వరకు సర్వే జరుగుతుందన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలలో 75 మంది బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పరిశీలిస్తారన్నారు. 10 పోలింగ్ కేంద్రాలకు ఒక సూపర్‌వైజర్ చొప్పున వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. వారికిచ్చిన షెడ్యూలు ప్రకారం ప్రతీ రోజూ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓటర్లను ఇంటింటి తనిఖీ చేసి 18 ఏళ్లు నిండిన వారికి ఓటర్ల నమోదు, నమోదులో ఉన్న వారి మార్పులు, చేర్పులు సరిచేయనున్నట్లు తెలిపారు. డెత్‌లు, డబుల్ ఎంట్రీలను తొలగించి తప్పులు లేని ఓటర్ల లిస్టు తయారీ కోసం ఈ కార్యక్రమం జరగుతుందని ఆయన తెలిపారు.

కోనసీమ ఫిలిం అసోసియేషన్ విజయోత్సవం



విజయోత్సవాన్ని నిర్వహిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన దర్శకుడు చెందు ముద్దు దర్శకత్వంలో కోనసీమకు చెందిన సినీ నటులు నటించిన చిత్రం 'అన్నపూర్ణ ఫొటో స్టూడియో' విడుదల సందర్భంగా స్థానిక వెంకట రమణ థియేటర్ వద్ద కోనసీమ ఫిలిం అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవం జరిగింది. ఆ చిత్రంలో నటించిన కోనసీమ నటులు గనిశెట్టి రమణలాల్, గుర్రం రామకృష్ణ, భద్రాజీ, ఆటో శ్రీను, డాన్ శ్రీను, కుమార్, దుర్గారావు, సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో తొలుత కేక్ కట్ చేశారు. ఆ థియేటర్‌లో చితాన్ని కోనసీమకు చెందిన 25 మంది నటులు వీక్షించి తర్వాత విజయోత్సవం నిర్వహించారు. అమలాపురానికి చెందిన చిత్ర దర్శకుడు చెందు ముద్దు చిత్రంలో 1980 నాటి కోనసీమ అందాలను కళ్లకు కట్టినట్టు చూపించారని కోనసీమ ఫిలిం అసోసియేషన్ ప్రతినిధి రమణలాల్ అన్నారు. దర్శకుడు చెందు ఈ ప్రాంతానికి చెందిన నటులకు అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.

వీఆర్ఏల రిలే దీక్షలు

ముమ్మిడివరం: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల వీఆర్ఏలు శుక్రవారం స్థానిక తెలుగు తల్లి విగ్రహం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. వీఆర్ఏలకు పే స్కేలు ఇవ్వాలని, నామినీలుగా కొనసాగుతున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలని, ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

భర్త, అత్త వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం

యానాం: తన భర్త, అత్త వేధింపులకు గురిచేస్తున్నారనే ఆవేదనతో శుక్రవారం యానాం పట్టణానికి చెందిన కె.దుర్గాభవాని అనే మహిళ గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టడంతో స్థానిక పోలీసులు స్పందించి ఆమెకు సర్ది చెప్పి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై శేరు నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం అమలాపురానికి చెందిన కె.దుర్గాభవానికి యానాం సాలికోట స్ట్రీట్‌లోని కె.అనిల్‌కు 2020లో వివాహం జరిగింది. అయితే తదనంతరం త్వరగా గర్భం దాల్చానని అభాండాలు వేస్తూ అనుమానాలతో సూటిపోటి మాటలతో భర్త అనిల్‌తో పాటు అత్త వసంతమేరి కూడా వేధించిందని, అబార్షన్ సైతం చేయించుకోమని ఒత్తిడి చేశారని బాధితురాలు తనకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పుస్తకాల పంపిణీ

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధి రాఘవులపేట మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. డీఎస్పీ మోకా సత్తిబాబు నిర్వహిస్తున్న ట్రస్ట్ ద్వారా దళిత విద్యార్థుల అభ్యున్నతికి సహాయ, సహకారాలు అందిస్తున్నట్టు మాల మహానాడు నాయకులు తెలిపారు. కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి, దాసరి సత్యనారాయణ, ఉండ్రు సత్యనారాయణ, గూటం సాయి, విజయ్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.